

వైభవంగా మల్లికార్జున స్వామి ఉత్సవాలు



గోపాల్‌పూర్‌లో ఎడ్లబండ్లతో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్థులు

కరీంనగర్ రూరల్, మే 19: మండలంలోని గోపాల్‌పూర్‌లో ఆదివారం జీల్గుల మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం గ్రామస్థులు ఎడ్ల బండ్లతో ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలి వెళ్లారు. ఒగ్గు పూజారులు ఆధ్వర్యంలో పుట్ట బంగారం తీసుకువచ్చి పట్నం వేసి మల్లికార్జున స్వామి కల్యాణం నిర్వహించారు. సోమవారం నాగవెల్లి పట్నం, అనంతరం మహిళలు బోనాలతో వచ్చి మొక్కులు చెల్లించడంతో ఉత్సవాలు ముగుస్తాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సాయిని మధు, కార్యదర్శి గోనె ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

- 345 అమ్మ ఆదర్శ పాఠశాలల ఎంపిక
- జిల్లాకు రూ. 14.17 కోట్ల నిధులు
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో చురుగ్గా సాగుతున్న పనులు



కరీంనగర్ టౌన్, మే 19: ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టనున్నది. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలపై ప్రత్యేక దృష్టిసారించింది. ఇందులో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన మన ఊరు..మన బడి కార్యక్రమంలో ఎంపిక చేయని పాఠశాలలను ఈ పథకంలో చేర్చి మౌలిక సౌకర్యాలను కల్పించాలని నిర్ణయించింది. పాఠశాలల అభివృద్ధి పనులను మహిళా సంఘాలకు అప్పగించాలని, గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్డీవోకు, పట్టణ ప్రాంతాల్లో మెప్మా అధికారులు స్వశక్తి మహిళా సంఘాల్లోని క్రియాశీల సభ్యులను విలేజ్ ఆర్గనైజర్లుగా ఎంపిక చేయాలని సూచించింది. ఇప్పటికే మహిళా సంఘాల నుంచి విలేజ్ ఆర్గనైజర్లను ఎంపిక చేశారు.

● మొదటి విడతలో 25 శాతం నిధుల విడుదల

జిల్లాలోని 348 పాఠశాలలను అమ్మ ఆదర్శ స్కూల్స్‌కు ఎంపిక చేసి ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అధికారుల అంచనా మేరకు 14.17 కోట్ల నిధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి విడతలో ఇటీవలనే పనులు ప్రారంభించేందుకు 25 శాతం నిధులు 3.54 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో పాఠశాల భవనాల మరమ్మతులు, విద్యుదీకరణ పనులు, మంచినీటి సౌకర్యం, కొత్తగా మరుగుదొడ్లను నిర్మించడంతోపాటు పాఠశాల భవనానికి ఆకర్షణీయమైన రంగులు వేయాలని సూచించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విలేజ్ ఆర్గనైజర్ పేరుతో బ్యాంకుల్లో జాయింట్ అకౌంట్ ఓపెన్ చేసి నిధులను వాటిలో జమ చేశారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ పనులను చురుగ్గా చేపడుతున్నారు. పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్‌శాఖ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ఈ పనులన్నిటిని పాఠశాలల పునఃప్రారంభం వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 11 వరకు వేసవి సెలవులుండడంతో ఆలోగా పనులు పూర్తయ్యే విధంగా విద్యాశాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ పమేలాసత్పతి, డీఈవో సీహెచ్‌వీఎస్ జనార్దన్ రావు ఎప్పటికప్పుడు ప్రగతి నివేదికను తెప్పించుకోవడంతోపాటు పాఠశాలలను సందర్శించి అవి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖపై సమీక్ష నిర్వహించి అమ్మ ఆదర్శ పాఠశాలలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్‌పై చర్చిస్తారని చెబుతున్నారు. పేద, సామాన్య కుటుంబాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం దృష్టిసారించడం అభినందనీయమని విద్యావంతులు, విద్యాభిమానులు, మేధావులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనతోపాటు ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, స్కావెంజర్లను తిరిగి పాఠశాలల్లో నియమించాలని, నిధుల కేటాయింపులను పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

కరీంనగర్ రూరల్, మే 19: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నగునూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం బీజేపీ నాయకులు సందర్శించారు. రైతుల సమస్యలను, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అకాల వర్షాల వల్ల వడ్లు తడవడంతో తేమశాతం రావడం లేదని తెలిపారు. రైతు వద్ద తరుగు పేరుతో దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ప్రతి క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్, రెండు లక్షల రుణమాఫీ, 15 వేల రూపాయల రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేవంత్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తాకుతుందని, రైతులకు బీఆర్ఎస్ పాలనతో ఏ విధమైన అన్యాయం జరిగిందో అంతకంటే ఎక్కువ అన్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి రమణారెడ్డి, దాడి సుదాకర్‌రెడ్డి, చిందం అశోక్, తోట సాయి, దేవరకొండ అజయ్, బాలి సత్యం, కమలాకర్‌రెడ్డి, కూకట్ల రమేష్, అసిరి తిరుపతి, దావు శేఖర్, చరణ్, హరీష్, రాజు, పవన్, సంజయ్ పాల్గొన్నారు.



నగునూర్ కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు



కంకర పోసి వదిలేసిన రోడ్డు



గాగిరెడ్డిపల్లి నుంచి ఇందుర్తి గ్రామం వరకు వెళ్లే రోడ్డు

పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమిస్తాం



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

భగత్‌నగర్, మే 19: పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్థంతిని పురస్కరించుకుని సీపీఎం జిల్లా కారాలయం ముకుందలాల్ మిశ్రాభవన్‌లో జెండాను ఆవిష్కరించారు.ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ పేద పక్షపాతి, కార్మిక, కర్షక, ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. కుల మతాలకతీతంగా సమ సమాజ స్థాపనకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదిర్శవర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, బీమాసాహెబ్, యు శ్రీనివాస్, ఎడ్ల రమేష్, జి రాజేశం, డి నరేష్‌పటేల్,జిల్లా నాయకులు తిప్పారపు సురేష్, జి తిరుపతి, కోనేటి నాగమణి, గజ్జల శ్రీకాంత్, పుల్లెల మల్లయ్య, గాజుల కనక రాజ్, ఎడ్లరజిత, భూ మేష్ పాల్గొన్నారు.

గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

కరీంనగర్ కల్చరల్, మే 19: గోహత్య నిషధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని గోరక్షా ప్రముఖ్ విభాగ్ వుట్కూరి రాధాకృష్ణారెడ్డి అన్నారు. నగరంలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఆదివారం జిల్లా గోరక్షా విభాగ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతీ జిల్లాలో కనీసం 10 ఎకరాల స్థలంలో ప్రభుత్వమే గోశాలలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఆవుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు శాశ్వత పోలీస్ ఔట్ పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. గో ఆధారిత వ్యవసాయదారులకు వంద శాతం సబ్సిడీలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న ఉదయం 10 గంటలకు కరీంనగర్ సుభాష్‌నగర్ వీహెచ్‌పీ కార్యాలయంలో జరిగే గోరక్షా విభాగ్ బైఠక్ ప్రత్యేక సమావేశానికి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల్, మంచిర్యాల, సిరిసిల్ల, కుమరం భీం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రావు, ఆదిమూలం విద్యాసాగర్, జగదీశ్, ప్రదీప్‌కుమార్, కన్నం శంకర్, సాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రోడ్డు పూర్తయ్యేదెన్నడు?

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, కాంట్రాక్టరు

చిగురుమామిడి, మే 19: మండలంలోని గాగిరెడ్డిపల్లి నుంచి ఇందుర్తి గ్రామం వరకు రోడ్డు సౌకర్యం లేక గ్రామస్థుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంవత్సరం క్రితం సుందరగిరి నుంచి గాగిరెడ్డిపల్లి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి 19 కోట్లు మంజూరు చేశారు. నిధులు మంజూరైనా పనులు ఆలస్యంగా ప్రారంభించారు. సంవత్సరం గడిచినా ఇప్పటికీ రోడ్డు పనులు పూర్తి కాలేదు. గ్రామస్థులు రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టరు ను అనేక సార్లు కోరారు. ఎవరూ పట్టించుకోలేదు. సుందరగిరి నుంచిగాగిరెడ్డిపల్లి వరకు కొంత మేరకు పనులు చేసి వదిలి వేశారు. గాగిరెడ్డిపల్లి నుంచి ఇందుర్తి వరకు పనులే ప్రారంభించలేదు. గాగిరెడ్డిపల్లి నుంచి ప్రతి రోజు దాదాపు 30 మంది విద్యార్థులు ఇందుర్తిలోని ప్రభుత్వ పాఠశాలకు వెళతారు. రోడ్డు సక్ర మంగా లేక వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతి నిధులు స్పందించి రోడ్డుపనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎవ్వరూ పట్టించుకోవడం లేదు



- సన్నీల్ల వెంకటేశం, గాగిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్

రోడ్డు విషయంపై సంబందిత అధికారులతో, కాంట్రాక్టరుతో అనేక సార్లు మాట్లాడాను. ప్రజలు, విదార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పినా పట్టించుకోవడం లేదు. రోడ్డు పనులపై అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోతే ఆందోళనలు నిర్వహిస్తాం.

23న పీఆర్టీయూ ప్రతిభా అవార్డుల ప్రదానం

కరీంనగర్ టౌన్, మే 19: గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రతిభా అవార్డు ప్రదానం చేయనున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముస్కు తిరుపతిరెడ్డి, మర్రి జైపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో ఈనెల 23న ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భట్టాపురం మోహన్‌రెడ్డి, పూల రవీందర్ హాజరవుతారన్నారు. కార్యక్రమానికి 16 మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు హాజరై విజయ వంతం చేయాలని కోరారు.

మానేరును తోడేస్తున్న మట్టి మాఫియా

- గుంతలుగా మారిన ఎల్ఎండీ జలాశయం
- స్నానానికి వెళ్లి గుంతల్లో పడి పలువురి మృత్యువాత



ఎల్ఎండీలో మట్టి గుంతలు

కరీంనగర్ క్రైం, మే 19: కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో అక్రమార్కులు మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వుతున్నారు. కరీంనగర్ నుంచి తిమ్మాపూర్, కొత్తపల్లి మండలాల వరకు విస్తరించి ఉన్న లోయర్ మానేరు జలాశయం(ఎల్ఎండీ)లో ప్రస్తుతం నీరు అడుగంటడంతో జలాశయం చివరలో పెద్ద పెద్ద మట్టి బొందలు దర్శనమిస్తున్నాయి. కరీంనగర్‌లోని మట్టి మాఫియా మానేరులో అక్రమంగా మట్టిని తోడేయడంతో పెద్ద పెద్ద బొందలుగా తయారయ్యాయి. వర్షాకాలంలో పూర్తిస్థాయిలో నీరు నిండిన సమయంలో బొందలు ఉన్నట్లు తెలియక స్నానానికి, ఈత కోసం జలాశయంలోకి వెళ్లిన వారి ప్రాణాలను మింగేస్తున్నాయి.

● రాత్రి వేళలో అక్రమంగా తరలింపు

ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో మానేరు జలాశయంలోని మట్టిని అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మానేరు జలాశయంలో అనుమతులు లేకుండా తట్ట మట్టికూడా తీయరాదు. కానీ ప్రతి రోజు రాత్రి ఎనిమిది గంటల నుంచి తెల్లవారు జాము వరకు మానేరు జలాశయంలో ఎక్స్‌కావేటర్‌తో వందలాది లారీలు, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. కరీంనగర్ శివారులో ఉన్న మానేరు జలాశయం వద్దకు సేదదీరడానికి వెళుతున్న విద్యార్థులు, యువ కులు జలాశయంలోకి దిగి గుంతల్లో పడి ప్రాణాలు కోల్పోతున్నారు.



గుంతలమయంగా ఎల్ఎండీ

● పట్టించుకోని అధికారులు

మానేరులో ఇష్టారీతిగ తవ్వకాలు జరుపుతుండటంతో జలాశయం సహజ స్థితిని కోల్పోయే ప్రమాదం ఉంది. ఎస్సారెస్పీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రతి యేటా వేసవిలో పెద్ద పెద్ద గుంతలు తవ్వి మట్టిని తీసుకెళ్తున్నారు. అహ్లాదం కోసం మానేరు డ్యాం వద్దకు వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వేసవి సెలవులతో మానేరు డ్యాం దృశ్యాలను చూడటానికి, అక్కడి ప్రకృతి సౌందర్యాలను ఆస్వాదించడానికి విద్యార్థులు, యువతీ యువకులు భారీ సంఖ్యలో జలాశయం వద్దకు చేరుకుంటున్నారు. జలాశయంలో బొందలలో నాచు, బుడుగు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ విషయం తెలియని యువకులు నీటిలోకి దిగి ప్రమాదాలబారిన పడుతున్నారు. జలాశయం వద్ద ప్రమాదం పొంచి ఉన్న విషయం తెలిసి కూడా ప్రాజెక్టు అధికారులు భద్రతా చర్యలు తీసుకోనందునే ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2015 మే 25న కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో ఆరుగురు విద్యార్థులు నీటి గుంతలో మునిగి మృత్యువాత పడిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. జలాశయంలో మట్టితీసిన గుంతలో ఒక్కచోటనే ఆరుగురు చిన్నారుల మృతదేహాలు లభ్యమయ్యాయి.

ఐదుగురిపై గృహహింస కేసు నమోదు

నెన్నెల, మే 19: అదనపు కట్నం కోసం వేధించిన ఐదుగురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు. నెన్నెలకు చెందిన మౌనిక (హరిత)తో పెద్దపల్లి జిల్లా గుర్రంపల్లికి చెందిన నాగులమల్యాల రాజుతో 2023లో పెళ్లి జరిగింది. కట్నకానుకలు ఇచ్చి వివాహాన్ని ఘనంగా జరిపించారు. వివాహమైన 15 రోజుల నుంచే అదనపు కట్నం తేవాలని భర్త రాజు చిత్రహింసలు పెట్టేవాడని పేర్కొన్నారు. అత్త అమ్మాయి, మామ ఆనందం, ఆడపడుచు బ్రహ్మోజు స్వప్న, ఆమె భర్త రవిబాబు సైతం మౌనికను మానసికంగా వేధించేవారని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

కూతురిని కడతేర్చిన తల్లిదండ్రుల అరెస్ట్

● మానసిక స్థితి బాగాలేదని కూతురికి ఉరివేసి హత్య ● వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, మే 19: కన్నకూతురును కడతేర్చిన తల్లిదండ్రులు కటకటాలపాలైన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల గ్రామంలో జరిగింది. జిల్లాలోని తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల గ్రామంలో కూతురి మానసిక స్థితి బాగాలేదని ఎలాగైనా వదిలించుకోవాలని భావించి ఈ నెల 14న అర్ధరాత్రి ఇంట్లోనే ఉరివేసి హత్యచేశారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో హత్యకు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో ఎస్పీ వెల్లడించారు... తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన చెప్యాల ఎల్లవ్వ, నర్సయ్య దంపతులకు ప్రియాంక(24) ఏకైక కుమార్తె. ప్రియాంక ఈ నెల 14న మృతి చెందింది. ఆమె మృతిపై గ్రామస్థులకు అనుమానాలు రావడంతో ఆ సమాచారాన్ని తెలుసుకున్న గ్రామ కార్యదర్శి రాజు తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో భాగంగా కన్నకూతురి మానసిక స్థితి సరిగా లేకపోవడం వల్ల తల్లిదండ్రులే ఉరివేసి హతమార్చారని తేలింది. కూతురు ప్రియాంక మానసిక వ్యాధితో బాధపడుతూ మృతిచెందినట్లు చిత్రీకరించి భర్తకు సమాచారం అందించి మృతదేహాన్ని ఆమె అత్త వారి గ్రామమైన దర్గపల్లికి తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. ప్రియాంక మృతిపై అనుమానం వెల్లువెత్తడంతో ఆమె తల్లిదండ్రులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా సంఘటన గుట్టురట్టయింది. నేరెళ్ల గ్రామానికి చెందిన చెప్యాల ఎల్లవ్వ, నర్సయ్య దంపతులకు ప్రియాంక ఏకైక కుమార్తె. ఏడేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. కుమార్తె ప్రియాంకను తల్లిదం డ్రులు ఆస్పత్రులలో చికిత్స చేయించగా కొంత వ్యాధి నయమైంది. దీంతో ప్రియాంకకు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని దర్గపల్లి గ్రామానికి చెందిన పృథ్వి అనే వ్యక్తితో 2020లో పెళ్లిచేశారు. వివాహం అనంతరం ప్రియాంక, పృథ్వి దంపతులు జీవనోపాధి కోసం కరీంనగర్‌లోని సప్తగిరికాలనీలో నివాసం ఉన్నారు. వీరికి 13 నెలల కుమారుడు ఉన్నాడు. నెల రోజులుగా ప్రియాంక మళ్లీ మానసిక వ్యాధితో బాధపడుతూ అందరిని ఇబ్బంది పెట్టడమే కాకుండా కుమారుడిని కొట్టి కిందపడేయడం చేస్తుందని ఆమె భర్త పృథ్వీ అత్తమామలైన ఎల్లవ్వ, నర్సయ్యలకు చెప్పాడు. దీంతో కూతురు ప్రియాంకను కరీంనగర్ నుంచి నేరెళ్లకు తీసుకువచ్చిన తల్లిదండ్రులు బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయం వద్ద వ్యాధి నయం అవుతుందని మూడు రోజులు ఉంచినా ఎంతకీ నయం కాలేదు. విసిగిపోయిన తల్లిదండ్రులు ప్రియాంకను నేరెళ్ల గ్రామానికి తీసుకువచ్చారు. కూతురు మానసిక వ్యాధి నయం కోసం చికిత్స కోసం తిరగడంతో తల్లిదండ్రులకు అప్పులు పెరిగాయి. దీంతో ఆమెను ఎలాగైనా వదిలించుకోవాలనుకున్న తల్లిదండ్రులు ఈ నెల 14న అర్ధరాత్రి ప్రియాంక ఇంట్లో నిద్రిస్తుండగా నూలు దారంతో ఉరివేసి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలిందని ఎస్పీ చెప్పారు. ఈ మేరకు కన్నకూతురిని హత్యచేసిన తల్లిదండ్రులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. ఈ హత్యను గ్రామస్థుల సమాచారం మేరకు ఛేదించామని వివరించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల రూరల్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, తంగళ్లపల్లి ఎస్ఐ సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

రామగుండంలో రూ.4కోట్ల చెక్కులు వాపస్

● 5శాతం ఇస్తే బిల్లులు పాస్ ● ఏడాదిగా ట్రెజరీల చుట్టూ తిరుగుతున్న కార్పొరేషన్ కాంట్రాక్టర్లు

కోల్‌సిటీ, మే 19: రామగుండం నగరపాలక సంస్థలో గత ఏడాది అభివృద్ధి పనులు చేసి చెక్కులు తీసుకున్న కాంట్రాక్టర్లకు బిల్లులు పాస్‌కాలేదు. ఏడాది పాటు ట్రెజరీల చుట్టూ తిరిగిన కాంట్రాక్టర్లకు ఆర్థిక సంవత్సరం ముగియడంతో చెక్కుల గడువు ముగిసిందంటూ వాపసు పంపారు. రామగుండం నగరపాలక సంస్థకు చెందిన రూ.4కోట్ల చెక్కులు వాపసు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 14వ ఆర్థిక సంఘం, ఎస్సీ సబ్‌ప్లాన్, పట్టణ ప్రగతి, ఏసీడీపీ నిధులకు చెందిన చెక్కులు ఉన్నాయి. ఇందులో కేవలం పట్టణ ప్రగతికి సంబంధించే రూ.3కోట్ల బిల్లులు ఉండగా 14వ ఆర్థిక సంఘంకు సంబంధించి రూ.1కోటి ఉన్నాయి. చివరికి నియోజకవర్గ అభివృద్ధి నిధులకు సంబంధించి ఏసీడీపీ చెక్కులు కూడా పాస్‌కాలేదు. రామగుండంలో రూ.40లక్షల ఏసీడీపీ చెక్కులు కూడా వాపసు వచ్చాయి. రామగుండం నగరపాలక సంస్థలో మే 2023 నుంచి బిల్లులు పాస్‌కావడం లేదు. మే 2023 నుంచి మార్చి 31, 2024వరకు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 143పనులకు సంబంధించి బిల్లులు పాస్‌కాలేదు. ట్రెజరీలో, సంబంధిత హెడ్‌లలో నిధులు లేవనే కారణంగా వీటిని పెండింగ్‌లో పెట్టారు. దీంతో అప్పులు తెచ్చి పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు వాపసు రావడంతో లబోదిబోమంటున్నారు. ఇప్పటికే ఏడాది వడ్డీలు మీద పడ్డాయని, ఇంకా జాప్యం జరిగితే పెట్టుబడులు పూర్తిగా నష్టపోతామని వాపోతున్నారు.

● రామగుండం నగరపాలక సంస్థకు సంబంధించి వివిధ స్కీముల బిల్లులు పాస్ చేయడంలో ఆర్థికశాఖలో అవకతవకలు చోటుచేసుకుంటున్నట్టు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో బిల్లుపై 5శాతం కమీషన్ ఇస్తే బిల్లులు పాస్ చేస్తున్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఒకే స్కీముకు సంబంధించి కొందరి కాంట్రాక్టర్ల బిల్లులు మే, 2023 నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. అదే స్కీముకు సంబంధించి 2024లో పనులు చేసి మార్చిలో చెక్కులు తీసుకున్న కాంట్రాక్టర్లు హైదరాబాద్‌లోని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో పైరవీలు చేయించుకుంటే బిల్లులు పాసయ్యాయని, తమ బిల్లులు మాత్రం పెండింగ్‌లో పెట్టారని ఆరోపిస్తున్నారు.

ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ మృతి

హుజూరాబాద్, మే 19: హుజూరాబాద్ పట్టణంలోని కాకతీయ కాలనీకి చెందిన అల్లి మహేందర్ (58) అనే ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అల్లి మహేందర్‌కు శనివారం రాత్రి ఛాతీలో నొప్పిగా ఉండడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మహేందర్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎల్ఐసీ ఏజెంట్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు.

రూ.300 అపరాధ రుసుముతో పాలిసెట్ దరఖాస్తుకు చివరిరోజు నేడు

కరీంనగర్ టౌన్, మే 19: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్-24కు దరఖాస్తు చేసుకునేందుకు రూ.300 అపరాధ రుసుముతో సోమవారం చివరిరోజని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శ ఆవాస మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనుమతి లేని పాఠశాలల పేర్లు ప్రకటించాలి

భగత్‌నగర్, మే 19: జిల్లాలో అనుమతి లేని పాఠశాలల పేర్లు బహిర్గతం చేయాలని ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రమేష్‌లు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలో గుర్తింపు లేని పాఠశాలల పేర్లు బహిర్గతం చేయకుండా గుర్తింపు ఉన్న పాఠశాలల్లో మాత్రమే తమ పిల్లల్ని చదివించాలని ప్రకటించిన డీఈఓ ప్రకటన సరైంది కాదన్నారు. జిల్లాలో అనుమతి లేని పాఠశాలల పేర్లు ప్రకటించాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై నిరసన

● వడ్ల కుప్పపై డీజిల్‌పోసి నిప్పంటించే యత్నం

జగిత్యాలరూరల్, మే 19: ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. జగిత్యాల జిల్లా జగిత్యాల మండలం గోపాల్‌రావుటపేట ఐకేపీ సెంటర్‌లో అదే గ్రామానికి చెందిన అంబటి సందీప్ అనే యువ రైతు తన ధాన్యాన్ని 27 రోజులు గడిచినా అధికారులు తూకం వేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ తన వడ్ల కుప్పపైన డీజిల్ పోసి నిప్పంటించే ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న స్థానిక రైతులు రైతును అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతు సందీప్ మాట్లాడుతూ అధికారులు పట్టించుకోకపోవడంతోనే కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందన్నాడు. తూకం వేయమంటే ఏదో కారణం చెబుతూ ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదన్నారు. లారీలు, రైస్‌మిల్‌ను రైతులే మాట్లాడుకోవాలని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారన్నారు. ఐకేపీ సెంటర్‌లో కనీస మౌలిక వసతులులేవని ఆవేదన వ్యక్తం చేశారు. సెంటర్ నిర్వాహకులు తమకు అనుకూలంగా ఉన్నవారి ధాన్యాన్ని మాత్రమే త్వరగా తూకం వేస్తున్నారని రైతులు ఆరోపించారు. ఇప్పటివరకు సెంటర్‌లో 30 శాతం కొనుగోళ్లు మాత్రమే జరిగాయని, మిగతా 70 శాతం ధాన్యం ఐకేపీ సెంటర్‌లోనే మగ్గుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. వాతావరణం మార్పుల వల్ల వర్షం వచ్చే అవకాశం ఉండడంతో జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపాల్‌రావుపేట స్థానిక రైతులు, మహిళలలు పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్రాలపై ఆసక్తి చూపని రైతులు

● మండల సమాఖ్యల ఆధ్వర్యంలో కొనుగోళ్లు
● మూలనపడ్డ ట్రాక్టర్, యంత్రాలు

మల్యాల, మే 19: స్వశక్తి మహిళల ఆర్థికాభివృద్ధి, రైతులకు తక్కువ అద్దె ధరలకు వ్యవసాయ యంత్రాలు సమకూర్చడానికి మండల సమా ఖ్యల ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ట్రాక్టర్, పరికరాలపై రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వ్యవసాయ యంత్రాలు నిరూపయోగంగా మారాయి. రైతులకు తక్కువ అద్దెపై సాగు చేసుకోవడంకు గాను దున్నడం తదితర వాటి కోసం ట్రాక్టర్, ట్రాలీ , రోటో వేటర్, కల్టివేటర్. వరి నాటు యంత్రాలు తదితరవి జిల్లాలోని 15మండ లాలల్లో గల ఐకేపీ మండల సమాఖ్యల ఆధ్వర్యంలో గత ఏడాది క్రితం రూ.12.67లక్షల వ్యయంతో కొనుగోలు చేశారు. ఈ యంత్రాలను మండల సమాఖ్య ఆధ్వర్యంలో రైతులకు అద్దె ఇవ్వడానికి గాను కొనుగోలు చేయగా వాటి పట్ల రైతులు మక్కువ చూపడం లేదు. అద్దెకు నగదు చెల్లించి తీ సుకెళ్లడం అనాసక్తికి కారణంగా తెలుస్తోంది. గ్రామాల్లో వ్యవసాయ పను లు చేసిన అనంతరం పంటల దిగుబడి అయ్యాక ట్రాక్టర్ యజమానులకు డబ్బులు చెల్లిస్తుండగా ఇక్కడ మాత్రం ముందు చెల్లింపుల పట్ల రైతులు వీటిని తీసుకెళ్లడం లేదు. మల్యాలలో గల ఈ యంత్రాలను మ్యాడంపల్లికి చెందిన ఓ రైతుకు అద్దెకు ఇవ్వగా అతను సకాలంలో


మల్యాల సెర్ప్ కార్యాలయం వద్ద ట్రాక్టర్, యంత్ర పరికరాలు

అద్దె చెల్లించకపో వడంతో డబ్బుల కోసం మహిళ సమాఖ్య ప్రతి నిధులు, ఐకేపీ అధికారులు, రైతు మధ్య గొడవలు కూడా జరిగాయి. పోలీస్‌స్టేషన్ వరకూ గొడవ వెళ్లే క్రమంలో డబ్బులు చెల్లించినట్లు తెలిసింది. దీంతో వాటి నిర్వహణ మండల సమాఖ్యకు తలకుమించిన భారంగా మారింది.

● భారంగా మెయింటనెన్స్..

ట్రాక్టర్ మెయింటనెన్స్ భారంగా మారుతోంది. ఏడాది క్రితం కొనుగోలు చేసిన ట్రాక్టర్, ట్రాలీ ఇతరాత్ర వ్యవసాయ పరికరాలకు అద్దె ఎడాదికి కేవలం రూ.1.20లక్షలు రాగ వాటి నిర్వహణ ఖర్చులు రూ.30వేల పైగానే అయ్యాయి. పైగా ఆ యంత్రాలు మరింత మరమ్మతులకు గురయ్యాయి. మండల సమాఖ్యల ద్వారా కొనుగోలు చేసిన వీటి డబ్బులతో ఆశించిన ప్రయోజనం రాకపోవడంతో సమాఖ్య ప్రతినిధులు ప్రభుత్వానికి మొరపెట్టుకోవడంతో ఇటీవల రూ.10లక్షలు, యూనిట్ సబ్సిడీ కింద రూ.4లక్షలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయగా మండల సమాఖ్యల సొమ్ములు తిరిగివచ్చినట్లు అయినప్పటికీ ట్రాక్టర్, వ్యవసాయ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. వాటిని సద్వి నియోగం చేసుకుంటే మండల సమాఖ్యలకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు దీనిపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

● రైతులు ఆసక్తి చూపడం లేదు

రాజయ్య, ఏపీఎం, ఐకేపీ మల్యాల

ట్రాక్టర్, ట్రాలీ ఇతర వ్యవసాయ యంత్రాలను అద్దెకు తీసుకెళ్లడానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో వాటిని తమ కార్యాలయం వద్దే ఉంచాము. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. తగిన అద్దె వస్తేనే యంత్రాలను అద్దెకు ఇవ్వాల్సి ఉంటుంది. రైతులు కూడా సద్వినియోగం చేసుకుంటే మేలుగా ఉంటుంది.

అగ్ని ప్రమాదంలో ఈత వనం దగ్ధం


ఈతవనంలో చెలరేగుతున్న మంటలు

కోరుట్ల రూరల్, మే 19 : మండలంలోని చిన్నమెట్‌పల్లి - వెంకటాపూర్ గ్రామల మధ్యలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో ఈత వనం దగ్ధమైనట్లు గ్రామస్థులు, గౌడ సంఘ నేతలు ఆదివారం తెలిపారు. వ్యవసాయ క్షేత్రంలో రైతులు వ్యర్థాలను కాల్చడానికి ప్రయత్నిస్తున్న సమయంలో గాలికి ఆ ప్రాంతంలో ఉన్న ఈత వనంకు అంటుకున్నట్లు వారు తెలిపారు. మంటలను అదుపులోకి తీసుకరావడానికి రైతులతో పాటు గౌడ సంఘాలు ప్రయత్నం చేసి అదుపులోకి తీసుకవచ్చారు. సుమార్ 300 వరకు ఈత చెట్లు దగ్ధం అయినట్లు గ్రామస్థులు తెలిపారు.

ధర్మపురిలో వైభవంగా పల్లవోత్సవం, వసంతోత్సవం


వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


పూజల్లో పాల్గొన్న భక్తులు

ధర్మపురి, మే 19: ధర్మపురి నరసింహ నవరాత్రోత్సవాలు ఏడవ రోజు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద మంత్రోచ్చరణల మధ్య ఆలయ అర్చకులు స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడ షోపచార పూజ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మన్యసూక్త, రుద్రాభిషేకం, పంచోపనిషత్తులచే విశేష పూజలు, సప్త హారతులు, మహా నివేదన, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పల్లవోత్సవం, వసంతోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రధాన ఆలయ మండపంలో అందంగా వివిధ రకాల చెట్ల కొమ్మలతో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. గోధూళి సుమూహూర్తమున అర్చకులు స్వామి వారల ఉత్సవ మూర్తులను ప్రత్యేక పీఠ పైకి తీసుకవచ్చి ఆశీనులు చేశారు. అనంతరం పంచోపనిషత్తుల పారాయణ పూర్వకంగా వేద మంత్రాలు పఠించారు. పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాది కార్యక్రమాలు జరిపి పల్లవోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారలను దర్శించుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

చందుర్తి, మే 19: కుటుంబ కలహాలతో మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలో జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఈక శేషవ్వ (45) అనే మహిళ ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రించిన అనంతరం గదిలోకి వెళ్లి తలుపులు పెట్టుకుని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి తలుపులు పెట్టుకొని, తీయక పోయేసరికి కిటికీలో నుంచి చూడగా ఉరి వేసుకుని కనిపించింది. మృతురాలికి భర్త రవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, మే 19: జమ్మికుంట-బిజిగిరి షరీఫ్ రైల్వేస్టేషన్ల మధ్య ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) రైలు కింద పడి ఆదివారం మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. నలుపు రంగు నైట్ ప్యాంట్, నీలి రంగు ఫుల్ షర్ట్, క్రీమ్ కలర్ కట్ డ్రాయర్ అంచుపైన ఎమ్‌ఆర్‌జి ఆర్‌ఈడి అని రాసి ఉంది. ఎడుమ చేయి దండ రెక్క కింద ఒక పుట్టు మచ్చ, నలుపు రంగు వెంట్రుకలు, పిల్లి గడ్డం, చామనఛాయతో ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ కెంసారం సంపత్ తెలిపారు.

లారీ, వ్యాన్ ఢీ : ఒకరి మృతి


బ్రిడ్జ్‌పై ఎదురెదురుగా ఢీ కొన్న లారీ, వ్యాన్, రాజేశ్వర్‌రెడ్డి(ఫైల్)

కొడిమ్యాల, మే 19 : మండలంలోని పూడూర్ గ్రామ శివారులో ఉన్న బ్రిడ్జ్‌పై శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత లారీ వ్యాన్ ఢీ కొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపిన వివరాల మేరకు కరీంనగర్ రూరల్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన దామెర రాజేశ్వర్‌రెడ్డి వ్యాన్‌లో కరీంనగర్‌లో పాలను లోడు చేసుకొని భీంగల్‌కు బయల్దేరాడు. మార్గ మధ్యలో మండలంలోని పూడూర్ గ్రామ శివారులో గల బ్రిడ్జ్ వద్ద రాత్రి (జీజే- 25-యు-9696) నెంబరు గల లారీ ఎదురుగా వస్తున్న పాల వ్యాన్‌ను వేగంగా ఢీకొట్టాడు. దీంతో లారీ అదుపు తప్పి వ్యాన్‌పై పడటంతో వ్యాన్ డ్రైవర్ రాజేశ్వర్‌రెడ్డి(43)కి తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోని మృతి చెందాడు. రాజేశ్వర్‌రెడ్డి భార్య దామెర వనజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదంతో బ్రిడ్జిపై లారీ బోల్తా పడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొడిమ్యాల ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామస్థుల సహకారంతో సంఘటన స్థలంలో వాహనాలను క్రేన్‌లతో తొలిగింశారు. బ్రిడ్జ్‌పై నుంచి వాహనాలు రాక పోకలు సాగించడానికి పోలీసులు సుమారు 10 గంటలు శ్రమించారు. అనంతరం బ్రిడ్జ్‌పై నుంచి రాకపోకలు పునరుద్ధరించారు.

నాగంపేటలో వ్యక్తి అదృశ్యం


భూమాగౌడ్

గంభీరావుపేట, మే 19: గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన కోళ భూమాగౌడ్ అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. కోల భూమాగౌడ్ ఈనెల 15న బుధవారం గొల్లపల్లికి సామాను తీసుకొని వస్తానని ద్విచక్రవాహనంపై వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. వారి బంధువులు ఎంత గాలించినా భూమగౌడ్ ఆచూకీ లభించలేదు. సమీప బంధువుల గ్రామాలకు వెళ్లి వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీస్ స్టేషన్లో భూమాగౌడ్ కూతురు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

మెడికల్ కళాశాల పనులను అడ్డుకున్న రైతులు

● నష్టపరిహారం ఇచ్చిన తరువాతనే నిర్మాణం చేపట్టాలి ● హద్దుల కోసం ఏర్పాటు చేసిన కర్రలు దహనం


భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్న రైతులు


మెడికల్ కళాశాల వద్ద హద్దుకర్రలను దహనం చేస్తున్న రైతులు

సిరిసిల్ల రూరల్, మే 19: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో మెడికల్ కళాశాల అదనపు భవనాల నిర్మాణాలను రైతులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం అడ్డుకున్నారు. నూతన భవనాల నిర్మాణాల హద్దుల కోసం ఏర్పాటు చేసిన కర్రలను తీసి రైతులు దహనం చేశారు. పెద్దూర్ శివారులోని సర్వేనంబర్ 408లో ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను గతంలో జీవనోపాధికోసం భూములు లేని వారికి అప్పటి ప్రభుత్వాలు అందించాయి. ఆ భూములపై అధారపడి జీవిస్తున్న రైతులకు గత ప్రభుత్వం జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేయడంతో అప్పటి మంత్రి కేటీఆర్, జిల్లా కలెక్టర్ సదురు భూములకు చెందిన రైతులతో సమావేశాన్ని ఏర్పాటుచేసి మరో చోట వాణిజ్య పరమైన భూములను అందిస్తామని హమీ ఇచ్చి మెడికల్ కళాశాల కోసం 40 మంది రైతులకు చెందిన 36 ఎకరాలను తీసుకున్నారు. వెంటనే అందులో మెడికల్ కళాశాలను నిర్మించి ప్రారంభించారు. నష్టపరిహారంతో పాటు ఇచ్చిన హమీ ప్రకారం భూములను ఇవ్వాలంటూ రైతులు అధికారుల చుట్టుతిరిగినా ఎలాంటి స్పందన లేకపోవడంతో మిగతా భూముల్లో నిర్మాణాలను అడ్డుకకోవాలని రైతులు నిర్ణయించారు. అయితే గత నెల ఏప్రిల్ నెలలో అదనపు భవనాల నిర్మాణాలను చేసేందుకు కాంట్రాక్టర్ రావడంతో ఈ విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకొని నిర్మాణాలను అపాలంటూ వారం రోజుల పాటు రైతులు అందోళనలు చేపట్టారు. దీంతో కలెక్టర్ స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని అర్డీవోను అదేశించారు. అర్డీవో రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అదే ప్రాంతంలో ఉన్న భూములను రైతులతో కలిసి అర్డీవో రమేష్ పరిశీలించి అందులో భూములను అందిస్తామని హామీ ఇచ్చినా ఎలాంటి ఫలితం లేదు. భవనాలను నిర్మించేందుకు కాంట్రాక్టర్ అదివారం అక్కడి చేరుకుని నాగుల లక్ష్మికి చెందిన భూమిలో హద్దులను ఏర్పాటు చేయడంపాటు నిర్మాణాలకు అవసరమైన సామగ్రిని వేయడంతో ఈ విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకుని హద్దులను వేయకుండా అడ్డుకున్నారు. హద్దుల కోసం ఏర్పాటు చేసిన కర్రలను తొలగించి అక్కడే దహనం చేశారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, సింగిల్ విండో డైరెక్టర్ సలేంద్రి బాలరాజుయాదవ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఉలిసే తిరుపతి, నాగుల లక్ష్మీ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బీర్‌పూర్,మే 19:బీర్‌పూర్ మండలంలోని నర్సింహాల పల్లి గ్రామంలో ఆదివారం రాత్రి 14 క్వింటాల్ రేషన్ బియ్యాన్ని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు. బీర్‌పూర్ గ్రామానికి చెందిన కోట సంతోష్ అనే వ్యక్తి నర్సింహాలపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యన్ని తరలించడానికి సిద్దంగా ఉన్నడన్న పక్క సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి 14 క్వింటాల్ రేషన్ బియ్యాన్ని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వీరివెంట ఏఎస్సై గజేంధర్, కానిస్టేబుళ్ళు ముత్తయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక



సదస్సులో ప్రసంగిస్తున్న అధ్యాపకుడు మల్లేశం

హుజూరాబాద్‌రూరల్, మే 19: మండలంలోని సింగాపూర్ గ్రామంలోని వీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తున్న లింగబత్తిని మల్లేశం అంతర్జాతీయ సదస్సుకు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ హనుమకుమార్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు హైద్రాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఈ నెల 17,18వ తేదీలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు, ప్రైవేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలు చేస్తున్న సామాజిక సేవపై మాట్లాడి పరిశోధన పత్రాన్ని సమర్పించారు. అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక కావడం పట్ల కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మానకొండూర్, మే 19 : మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన భారతి కనకవ్వ అనే మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు స్థానిక సీఐ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లింగాపూర్‌కు చెందిన కనకవ్వకు జ్వరం రావడంతో అదే గ్రామానికి చెందిన మమత అనే ఆర్‌ఎంపీ వైద్యురాలు వేసిన ఇంజక్షన్ వికటించి తీవ్ర అస్వస్థతకు గురి అయిందని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందని సీఐ తెలిపారు.

పెద్దూర్ శివారులో ఇసుక డంప్‌లు


ఇసుకడంప్

సిరిసిల్ల రూరల్, మే 19: సిరిసిల్ల అర్బన్ పరిధి పెద్దూరు శివారులోని అపెరల్ పార్కు ప్రాంతంలో ఇసుక డంప్ చేశారు. సిరిసిల్లలో ఇసుక రవాణాకు పోలీసులతో పాటు రెవెన్యూ అధికారులు అంక్షలు విధించడంతో ఇసుక దొరకడం కష్టంగా మారింది. ఇసుకకు డిమాండ్ ఉండడంతో పెద్దూర్, సర్ధాపూర్‌కు చెందిన కొంత మంది ఇసుక స్మగ్లర్లు ఆదివారం గ్రామ శివారులో డంప్ చేసి రాత్రిపూట లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్థులు తెలిపారు. అధికారులు స్పందించి గ్రామ శివారులో ఉన్న ఇసుక డంప్‌లను సీజ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కంకర దారిపై కష్టాలెన్నో?


రోడ్డుపై కంకర

ఎల్లారెడ్డిపేట, మే 19: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట నుంచి గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట వరకు రహదారి పనులు కొనసాగుతున్నాయి. రూ 1.90కోట్ల నిధులతో తలపెట్టిన పనులు ఏడు నెలలుగా సాగుతూనే ఉన్నాయి. రోడ్డుపై కంకర తేలి ఉండడంతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. కంకర రహదారిపై ప్రయాణించే వారు జల పైలం మరి.

పెళ్లి కాలేదని చెప్పి రెండో వివాహం

● పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు ● నిందితుడిపై కేసు

కరీంనగర్ క్రైం, మే 19 : తనకు తల్లిదండ్రులు లేరని, పెళ్లి కాలేదని అబద్ధాలు చెప్పి మొదటి భార్య ఉండగానే మళ్లీ వివాహం చేసుకుని యువతిని మోసం చేసిన వ్యక్తితో పాటు అతడి కుటుంబ సభ్యులపై కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపల్లి పోలీసుల వివరాల ప్రకారం కొత్తపల్లి మండలం సీతారాంపూర్‌కు చెందిన యువతి కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ఆధ్యాపకురాలిగా పనిచేస్తున్నది. ఆమె తండ్రి మరణించగా సోదరుడు ఆమెకు వివాహ సంబంధాల కోసం 2021లో వావిలాలపల్లిలోని మ్యారేజ్‌బ్యూరోలో సంప్రదించాడు. హైదరాబాద్‌కు చెందిన ఒక సంబంధం వచ్చినట్లు, అబ్బాయి వివరాలను మ్యారేజిబ్యూరో నిర్వాహకులు బాధితరాలుకు ఇచ్చారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్న రాంనగర్‌లోని ముషీరాబాద్‌కు చెందిన సీహెచ్ వెంకట రాఘవేంద్రరావుతో సంప్రదింపులు జరపగా అతనికి వివాహం కాలేదని, తల్లిదండ్రులు లేరని చెప్పాడు. ఇద్దరు పరస్పరం ఇష్టపడ్డారు. ఈ మేరకు వెంకటరాఘవేంద్రరావు, అతని పిన్నిగా సత్యవతి అనే మహిళతో వచ్చి 2021 ఆగస్టు 25న కరీంనగర్‌లో వరపూజ చేసుకున్నారు. అదే సమయంలో 5 లక్షల నగదు, 2 తులాల బంగారనం వరకట్నం ఒప్పుకుని 50 వేల రూపాయలు ముట్టజెప్పారు. పెళ్లికి ఎవరినీ ఆహ్వానించవద్దని వెంకటరాఘవేంద్ర కోరగా కుటుంబ సభ్యుల సమక్షంలోనే 2022 జూన్ 26న ఎల్ఎండీ లక్ష్మినర్సింహస్వామి దేవాలయంలో ఇద్దరు వివాహం చేసుకున్నారు. పెళ్లి అనంతరం హైదరాబాద్‌కు వెళ్లి రాంనగర్ ప్రాంతంలో గది అద్దెకు తీసుకుని ఉన్నారు. వారానికి రెండు మూడు రోజులు ఇంటి వద్ద ఉండి ఆఫీస్ పనిఉందని మిగతా రోజులు ఇంటికి వచ్చేవాడు కాదు. అనుమానం వచ్చి ఆరాతీయగా ఉద్యోగం చేస్తున్న విషయం నిజమేనని వెల్లడైంది. వెంకటరాఘవేంద్ర ఆధార్‌కార్డు చిరునామా ఆధారంగా అతని ఇంటికి వెళ్లగా అతని ఇంటిలో తల్లిదండ్రులు, ఇద్దరు సోదరులు, మొదటి భార్య ఉన్నారు. దీనిపై వెంకటరాఘవేంద్ర నిలదీయగా కులం పేరుతో దూషించి, చేతులతో కొట్టి బెదిరించాడని బాధితురాలు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఘనంగా కొండస్వామి బ్రహ్మోత్సవాలు

మెట్‌పల్లి రూరల్, మే, 19 : మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులోని కొండపై వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏటా బండలింగాపూర్ సంస్థాన్ నుంచి జగ్గసాగర్ ఆలయంలోని ఉత్సవ మూర్తులను తీసుకరావడం అనవాయితీగా వస్తోంది. ఉత్సవమూర్తులను డప్పు చప్పుల మధ్య ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకిలో ఏర్పాటు చేసి శోభయాత్రగా గ్రామంలోని కొండస్వామి ఆలయానికి గంగపుత్రులు తీసుకొచ్చారు. ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసిన పురోహితులు అభిషేకాలు, అర్చనలు అలంకరణ, పూజలు, హారతి కార్యక్రమాలను జరిపారు. ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, గంగపుత్రులు, భక్తులు పాల్గొన్నారు.


ఊరేగింపుగా ఉత్సవ మూర్తులను తీసుకొస్తున్న గంగపుత్రులు

పంటపొలాల్లో అగ్ని ప్రమాదం

గంగాధర, మే 19: గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ శివారులో కోసిన వరిపొలంలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. పశుగ్రాసం, పొలాలకు నీటి సరఫరా కోసం వేసిన పైపులు, విద్యుత్ వైర్లు కాలిబూడిదయ్యాయి. మంటలకు గాలి తోడవడంతో ఒక్కసారి వ్యాపించాయి. నాగిరెడ్డిపూర్‌కు చెందిన సిరికొండ మధు పొలంలో పరదాల్లో కుప్పపోసిన ధాన్యం, నాలుగు పరదాలు కాలిపోయినట్లు తెలిపారు. ఈ ఘటనలో సుమారుగా లక్ష ఆస్తినష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. మంటలు అంటుకున్న సమయంలో రైతులు వాటిని ఆర్పేందుకు కరెంటు మోటార్లను ఆన్ చేశారు. అయితే అదే సమయంలో విద్యుత్ సిబ్బంది మరమ్మతులు జరపడానికి కరెంటు నిలిపివేశారు. విద్యుత్ ఉంటే ప్రమాద తీవ్రత ఇంత ఉండేది కాదని రైతులు పేర్కొంటున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ లేక ఇబ్బందులు

కోనరావుపేట, మే 19: కొన్ని సంవత్సరాల క్రితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ వరద తాకిడికి కూలిపోయింది. సుమారు ఏడు సంవత్సరాలు గడిచినా నిర్మాణం చేపట్టకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ ఏడు సంవత్సరాల క్రితం భారీ వర్షాల వల్ల వచ్చిన వరద తాకిడికి కూలిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టకపోవడంతో పశువులు లోపలికి వెళ్లి మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. అంతే కాకుండా ప్రహరీ లేకపోవడంతో సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.


కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

'పేదలకు ఆపన్నహస్తం అందిస్తున్న లయన్స్‌క్లబ్స్'



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

సుభాష్‌నగర్, మే 19: పేదలకు ఆపన్నహస్తం అందిస్తున్న సేవా సంస్థలు లయన్స్‌క్లబ్స్‌లని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు అన్నారు. ఆదివారం ప్రతిమ మల్టిప్లెక్స్‌లో నిర్వహించిన లయన్స్‌క్లబ్ మల్టిపుల్ కన్వెన్షన్‌కు అయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సేవా సంస్థ లయన్స్‌క్లబ్ అని అన్నారు. గత 107 ఏళ్ళుగా పేరొందిన లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ తెలంగాణ మల్టిపుల్ ప్రాంతంలో విస్తరించి, 8 జిల్లాల సౌజన్యంతో సుమారు 25,000వేల మంది సభ్యులు అనేక సమాజహిత సేవలను అందించడం హర్షదాయకమన్నారు. లయనిజం ద్వారా సేవల విస్తరణకు నూతన సభ్యుల ఆహ్వానం, మండల, పట్టణస్థాయి కొత్త క్లబ్బులను ఏర్పాటు చేయడం, విపత్తుల చట్రంలో నలుగుతున్న ప్రపంచ మానవాళిని ఆదుకోవడానికి ఫౌండేషన్ నిధులు అందచేయడంలో తమ క్లబ్బులు చొరవ తీసుకోవడం సంతోషదాయకమన్నారు. గ్యాట్ ఏరియా లీడర్ రుమాళ్ళ సునీల్‌కుమార్ మాట్లాడుతూ నిస్వార్థ సేవలకు పరిధులు, ఆంక్షలు లేవని, మారుమూల ప్రాంతాల నిరుపేదల ముఖాల్లో చిరుదీపం వెలిగించే ప్రయత్నం చేస్తూ, నిత్యం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ, అనేక రకాల అవసరాలకు సేవలందిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు, సభ్యులకు ప్రత్యేక ప్రశంసలు అందచేశారు. 320జి జిల్లా గవర్నర్ హనుమండ్ల రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మల్టిపుల్ కాన్ఫరెన్స్‌లో మినేష్‌నారాయణ్ టాండన్, ఎస్‌వి రావు, ఎస్ కోదండరామ్, ఎం భద్రేశం, మల్టిపుల్ లీడర్స్ దీపక్ బట్టాచార్జి, నరేందర్‌రెడ్డి,మోహన్, ఐపీఎంసిసి విద్యాసాగర్‌రెడ్డి, డాక్టర్ గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, మల్టిపుల్ కౌన్సిల్ బాధ్యులు వివిద జిల్లాల డిజిటిమ్, పిడిజీలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

భగత్‌నగర్, మే 19: కొత్తపల్లి మండలం బద్దిపల్లిలో శ్రీ అళరమేల్ మంగ, పద్మావతిసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణాన్ని వేద పండితులు జగన్నాథం విష్ణువర్ధనా చార్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు సింహాచలం మారుతిస్వామి ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ ఉప్పు తిరుపతి, రాచమల్ల నితిన్‌రెడ్డి, గోలి రాజు, కరీంనగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, కరీంనగర్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా రాచమల్ల దీప్తిశ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

ముగిసిన క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు



మాట్లాడుతున్న జెన్నీ క్రిస్టోఫర్

కరీంనగర్ కల్చరల్, మే 18: జిల్లా కేంద్రంలోని సేయింట్ మార్కు చర్చి గ్రౌండ్‌లో సిఎస్ఐ సంఘాల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగు తున్న క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు ఆదివారం ముగిసాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆదరణ కల్గిన ప్రసంగీకుడు జెన్నీ క్రిస్టోఫర్ హాజరై వాక్య పరిచర్య అందిస్తూ శాంతి సామరస్యంతో మెలుగుతూ మంచి సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలన్నారు. క్రీస్తు చూపిన శాంతి, సత్యం, అహింస, న్యాయం, ధర్మం, సేవా మార్గాల్లో పయనించాలని పేర్కొన్నారు. సభలు విజయవంతం చేసిన అందరికీ ప్రభువు ఆశీస్సులుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిషప్ డాక్టర్ కె రూబెన్‌మార్క్, బిషప్ సతీమణి ప్రెసిల్లా పరిమళ రూబెన్‌మార్క్, పాల్ కొమ్మాలు, డాక్టర్ ఎస్ జాన్, ఆర్ ప్రసాద్, బి ప్రసాద్, ఎ మధుమోహన్, డీకన్ పింటూ, డీకన్ రోజీ, రెనాల్డ్, తిమోతీజయరాజ్, క్రిస్టోఫర్, ఇండిపెండెంట్ పాస్టర్స్, స్థానిక సంఘాల పెద్దలు, ఇవాంజిలిస్టులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, మే 19: కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలను పరిష్కరించాలని కొత్తపల్లి వైస్ ఎంపీపీ భూక్య తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం చింతకుంటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ చాంద్‌పాషా, పైడిపాల సతీష్, సోమిరెడ్డి లచ్చిరెడ్డి, బోనాల శంకర్, కట్కూరి మల్లేశం, గజ్జల సాగర్, సయ్యద్ సలీం, రవీందర్‌రెడ్డి, మారుతి, శశిధర్, లక్ష్మణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ కన్వీనర్‌గా గడ్డం ధర్మారెడ్డి


గడ్డం ధర్మారెడ్డి

హుజూరాబాద్ రూరల్, మే 19: హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ (టీయూడబ్ల్యూజే ఐజేయూ) కన్వీనర్‌గా గడ్డం ధర్మారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని మధువని గార్డెన్‌లో హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత పాలకవర్గాన్ని రద్దు చేయడంతో పాటు నూతనంగా అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. కో-కన్వీనర్లుగా కాయిత రాములు, నిమ్మటూరి సాయికృష్ణ, సభ్యులుగా పత్తి విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీధర్, వేల్పుల సునీల్, పోతరాజ్ సంపత్, సృజన్, శ్రీనివాస్, సత్యరాజ్, చందులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు మామిడి రవీందర్, తిరునగరి ఆంజనేయస్వామి, కోరం సుధాకర్‌రెడ్డి, కేసీరెడ్డి నర్సింహారెడ్డి, పరాంకుశం కిరణ్‌కుమార్, ప్రెస్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మోహినీ ఏకాదశి


పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

కరీంనగర్ కల్చరల్, మే 19: స్థానిక తిరుమలనగర్ మయూరగిరి పీఠంలో (శ్రీనిలయం) ఆదివారం మోహినీ ఏకాదశి ఉత్సవం వైభవంగా కొనసాగింది. మయూరగిరి పీఠాధిపతి నమిలకొండ రమణాచార్యస్వామి వైదిక నిర్వహణలో లక్ష్మీనారాయణస్వామికి ఫలరస పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పారాయణాలు, ప్రత్యేక హవనాలు శాస్త్రోక్తంగా జరిపారు. ఈ సందర్భంగా రమణాచార్యస్వామి మాట్లాడుతూ ఏకాదశి రోజున లక్ష్మీనారాయణులను ఆరాధిస్తే సకల శుభాలు కలుగుతాయని అన్నారు. లోక కల్యాణార్థం ప్రత్యేక సంకల్పం చెప్పుతూ సకల జనుల క్షేమం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, శ్రీవారి కృప అందరిపై ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామకృష్ణమాచార్యులు, వివేక్, రమేశ్, శ్రీరామ సేవాతరంగిణి ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కాగా వచ్చే వరూధినీ ఏకాదశి ఉత్సవంలో భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

'రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ విఫలం'


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు

జమ్మికుంట, మే 19: రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఎరబెల్లి సంపత్‌రావు అన్నారు. ఆదివారం జమ్మికుంట పట్టణంలో పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్ అధ్యక్షతన నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాయ మాటలతో ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. ఎలాంటి కోతలు లేకుండా పండిన ప్రతి ధాన్యం గింజను మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలని, క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలన్నారు. బీఆరెస్ ప్రభుత్వంలో మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వంలో క్వింటాల్‌కు 5నుండి 7కిలోలు కోత పెడుతున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజా క్షేత్రంలో శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో శీలం శ్రీనివాస్, కోర రవిందర్, పల్లపు రవి, ఠాగూర్ రాజేష్, ఎ మధు, కొమ్ము ఆశోక్, ఇటుకల స్వరూప, కొండ్లె నాగేష్‌రావు, వేముల జగన్, ఉడుగుల మహేందర్, రవిందర్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

●భగత్‌నగర్: ఎన్నికలకు ముందురైతులకిచ్చిన హామిలన్ని నెరవేర్చాలని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందే అన్నారు. తాలు, తరుగు, తేమ పేరిట రైతాంగాన్ని వేధించవద్దన్నారు. ఖరీఫ్ రైతు భరోసా సాయం ఇప్పుడిస్తే యాసంగి రైతు భరోసా సాయం ఎప్పుడిస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో చెప్పిన విధంగా కాకుండా భిన్నంగా వ్యవహరిస్తుందన్నారు. డిసెంబర్‌కల్లా రైతు రుణమాఫీ, 500 బోనస్ ఎకరాకు 15 వేలు రైతు భరోసా ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రైతులకు మొండి చేయిచూపి మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో ప్రకటించిన అంశాలను ఎప్పటిలోగా అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విలకరుల సమావేశంలో దుబాల శ్రీనివాస్, కన్న కృష్ణ, బండ రమణారెడ్డి, పవన్, సత్యనారాయణ, కటకం లోకేష్, పర్వతాల మల్లేశం, గుంజేటి శివ, రవి, తదితరులు పాల్గొన్నారు.

●కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని మాజీ ఎంపిపి, బీజేపీ రాష్ట్ర నాయకుడు వాసాల రమేష్ అన్నారు. ఆదివారం కొత్తపల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మొన్న కురిసన వర్షానికి ఐకేపి కేంద్రాల్లో వరి ధాన్యం తడిసిపోయిందన్నారు. కొత్తపల్లి పట్టణంలోని ప్రతి రైతుకు క్వింటాలుకు 500 బోనస్ అందించాలన్నారు రైతు కూలీలకు వెంటనే 12వేలు ఇవ్వాలన్నారు. రైతులకు రుణమాఫి చేయాలన్నారు. సబ్సిడి విత్తనాలు అందించాలన్నారు. కొత్తపల్లి పట్టణంలో రైతులు ధాన్యం అమ్ముకోవడానికి పది ఎకరాల భూమిని కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కెంచ శేఖర్, బీజేపీ జిల్లా దళిత మోర్చా కార్యదర్శి ఎర్రోళ్ల ప్రదీప్, బీజేపీ ప్రధాన కార్యదర్శి కొప్పుల హరిప్రసాద్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఉమ్మెంతల లక్ష్మారెడ్డి, చిగుర్ల శ్రీనివాస్, స్వర్గం నర్సయ్య, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి చిట్కూరి శ్రీనివాస్, మ్యాల పోచమల్లు, మందల సేనారెడ్డి, నార్లమ రాజు,కోటగిరి శ్రీనివాస్, భైరి కిషోర్, జేరిపోతుల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

●హుజూరాబాద్‌రూరల్: అపత్కాలంలో ఉన్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని రంగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ ఆదేశాల మేరకు రైతు కల్లాలను పరిశీలించించినట్లు తెలిపారు. రైతుల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందన్నారు. రైతులకు క్వింటాల్‌కు రూ. 500ల చొప్పున బోనస్ ఇస్తామని చెప్పి ఊసే ఎత్తడం లేదన్నారు. మరో వారం రోజుల్లో రైతులు వానకాలం పంటకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎకరానికి రూ.7500ల రైతు బంధు వేసి పెట్టుబడి సాయం అందించాలన్నారు. కౌలు రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటి హామీలను పక్కాగా అమలు చేసిన తర్వాత గ్రామపంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు.

●మానకొండూర్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని బిజేపి జిల్లా ఉపాధ్యక్షులు రంగు బాస్కరాచారి డిమాండ్ చేశారు. మానకొండూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం వెంటనే చెల్లించాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్ళలో జాప్యం చేస్తు రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. క్వింటాల్ ధాన్యానికి రూ. 500 చెల్లించి రైతు రుణమాఫీ, రైతు భరోషా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కత్తి ప్రభాకర్‌గౌడ్, మాచర్ల కోటేశ్వర్, రంగు శ్రీనివాస్ ఉన్నారు.

●ఇల్లందకుంట: తాలు, తేమ, తరుగుతో గత బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ సర్కార్ రైతులను ఇబ్బంది పెడుతుందని బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన స్థానిక బీజేపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాలు, తేమ, తరుగుతో సంబంధం లేకుండా వడ్లన్ని కొనాలంటే ప్రభుత్వంపై వందల కోట్ల భారం పడుతుందని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం జంకుతుందన్నారు. వందల కోట్లకు భయపడి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భైరెడ్డి రమణారెడ్డి, ఆరెల్లి శ్రీనివాస్, ఉప్పుల రమేష్ సురేందర్‌రెడ్డి, ఎండీ షఫీఖాన్, రమేష్, శ్రీధర్‌రెడ్డి, రాంబాబు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

●వీణవంక: రైతులకు వెంటనే రుణమాఫీ అమలు చేయాలని మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో ఇటీవల వర్షానికి తడిసిన ధాన్యంను పరిశీలించారు. తడిసిన ధాన్యంను మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. ఫసల్ బీమా యోజనరైతులకుబోనస్ 500 ఇతర హామీలన్నీ అమలు చేయాలన్నారు. మండల అధ్యక్షుడు రామిడి అదిరెడ్డి, నాయకులుపెద్ది మాల్లారెడ్డి, చెన్నమాధవుని నర్సింహరాజు,పుప్పా రఘు,బత్తిని నరేష్,బొంగోని సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కరీంనగర్ రూరల్, మే 19: తీగలగుట్టపల్లి బృందావన్ కాలనీలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆదివారం నగరంలోని మెడికవర్ ఆధ్వర్యంలో నిర్వహించి ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికవర్ ఆసుపత్రి సామాజిక బాధ్యతగా వైద్యశిబిరాలు నిర్వహించి, ప్రజల ఆరోగ్యపరిరక్షణ కల్పిసుందన్నారు. ఇలాంటి వైద్యశిబిరాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెడికవర్ ఆసుపత్రిలో అన్నిరకాల సూపర్‌స్పెషాలిటి వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ కార్తిక్, డాక్టర్ కిషోర్ పలు వైద్యపరీక్షలు నిర్వహించారు.

బీఆర్ఎస్ నేత నరేందర్ మృతికి సంతాపం

కరీంనగర్ టౌన్, మే 19: బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, ఆరెకటిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాల్‌కార్ నరేందర్ మృతి పట్ల పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశాయి. నగరంలోని కాపువాడకు చెందిన మిర్యాల్‌కార్ నరేందర్ (52) ఆదివారం మధ్యాహ్నాం గుండె పోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. మిర్యాల్‌కార్ నరేందర్ మృతి పట్ల మాజీ ఎంపీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు హరిశంకర్‌తోపాటు పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన నరేందర్ మృతి తీరనిలోటని సానుభూతిని ప్రకటించారు.మాజీ డిప్యూటీ మేయర్, బీజేపీ రాష్ట్రనాయకుడు గుగ్గిళ్ళపు రమేశ్, దుడ్డెల శ్రీధర్, పూలే యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ నివాళులర్పించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న బొమ్మకల్ జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

కరీంనగర్ రూరల్, మే19: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ 2000-2001వ సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్కూల్‌లో ఆనాడు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి సత్కరించారు. అనంతరం ఆనాటి రోజులను నెమరు వేసుకున్నారు. స్కూల్‌లో చిన్ననాటి చిలిపి అల్లర్లను గుర్తు చేసుకున్నారు. ఈసంద ర్భంగా ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

●కరీంనగర్ టౌన్: చిన్నపుడు కలిసి చదువుకొని ఎక్కడెక్కడో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులంతా ఒక చోట కలుసుకొని ఆత్మీయ పలుకరిపులతో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆదివారం నగరంలోని కాపువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1975-76లో పదో తరగతి చదివిన విద్యార్థులు నగరంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు మాదాసు శ్రీనివాస్, కలిగిరి నాగరాజు, ఎస్ఐ శంకర్, జూనియర్ అసిస్టెంట్ కనుకయ్య, ఎస్ఐ శరత్, బీఎస్ఎన్ఎల్, వెంకటాచారి, ట్రాన్స్‌కో ఉద్యోగి కిష్టయ్య, సీనియర్ అసిస్టెంట్ రవీంద్ర, ఎస్ఐ విద్యాసాగర్, వ్యాపారి దశరథం తదితరులు చాలా రోజుల తర్వాత కలుసుకొని విద్యార్థి దశలోని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో, ఆనందోత్సాహాలతో తరచు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించుకోవాలని నిర్ణయించుకున్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి


స్టిక్కర్లు అందిస్తున్న నాయకులు

భగత్‌నగర్, మే 19: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో నష్టపోతున్న ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కరీంనగర్ జిల్లా పబ్లిక్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి చెలికాని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నగరంలోని రామాలయం వీధి ఆటో స్టాండ్ ఆటోలకు టాప్ నెంబర్లు, నేమ్ ప్లేట్‌లు అందించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణతో ఆటోలకు గిరాకి లేక ఆటో కార్మికులు కుటుంబాలను పోషించుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 50 మంది ఆటో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ఆత్మహత్య చేసుకున్న ప్రతి కుటుంబానికి పది లక్షల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దూస సతీష్‌కుమార్, ఇరుకుల్ల నరేష్, పోలు రవి, వరికోలు శ్రీకాంత్, శ్రీధర్, దురుషేటి శేఖర్, బొల్లం లక్ష్మణ్, కోమల రవి, డి సంపత్, బి అజయ్, చిందం అశోక్, నాగరాజు, అంతగిరి సముద్రాల రాము, ఈశ్వర్, సురేష్, ఇరుకుల్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

తిమ్మాపూర్(మానకొండూర్), మే 19 : మండలంలోని వివిద గ్రామాల రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము విత్తనాలు సబ్సీడిపై అందుబాటులో ఉన్నామయని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. మండలానికి జీలుగ 450 క్వింటాలు, జనుము 30 క్వింటాలు అలాట్ చేయడం జరిగిందని నుస్తులాపూర్ సహకార సంఘంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పట్టాదార్ పాసుబుక్కు ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరుతో విత్తనాలు పొందాలని రైతులను కోరారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

గన్నేరువరం, మే 19: మండల కేంద్రానికి చెందిన వెదిర ఆనంద్(29), కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన గాజుల సౌమ్య(19) గత కొంత కాలంగా ప్రేమించుకున్నారు. ఇద్దరి కులాలు వేరు కావడంతో పెద్దలు ఒప్పుకోరని ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం జంగారెడ్డిపల్లెలోని శ్రీరామలింగేశ్వర ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం తమ తల్లిదండ్రుల నుంచి ప్రాణభయం ఉందని మాకు రక్షణ కల్పించండంటూ గన్నేరువరం పోలీసులను ఆశ్రయించారు. ఇరు కుటుంబ సభ్యులకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి పంపించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక,మే19:మండలంలోని చల్లూరు గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా కొర్కల్ గ్రామనికి చెందిన సంగె రాజు ఎలాంటి అనుమతులు లేకుండా టాక్టర్‌లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తీసుకు వచ్చి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

మానసాదేవి ఆలయ వార్షికోత్సవం


మానసాదేవి అమ్మవారు

గన్నేరువరం, మే 19: మండలంలోని ఖాసింపేట గ్రామంలోని మానసాదేవి ఆలయ షష్టమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న వేడుకలలో భాగంగా తొలిరోజు గోపూజ, గురువందనం, గణపతి పూజ, ధ్వజారోహణ చక్రార్చన. 128 కళశాలతో మహాస్నపనం, సామూహిక హోమాలు, అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం శ్రీచక్రార్చన, త్రిశూల స్నానం, చండీ హోమం, మంగళవారం శ్రీచక్ర అర్చన, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, పలు హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

చిగురుమామిడి,మూ19: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు కలిసి ఉమ్మడిగా బీజేపీ సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేకొండ గ్రామాంలో బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన బీజేపీ పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పార్లమెంటు ఎన్నికల్లో బండి సంజయ్‌కుమార్‌కు నియోజకవర్గంలోనే అత్యధికంగా ఓట్లు వేయడం, మండలంలో పార్టీ సుంజుకోవడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలోనే చిగురుమామిడి మండలంలో బీజేపీ పార్టీకి మెజార్టీ ఓట్లు వస్తాయని అన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎళ్ల వేళలా అందుబాటులో ఉంటామని, ఎలాంటి ఇబ్బందులు వచ్చినా అండగా ఉంటామన్నారు. పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇస్తుందని అన్నారు. పార్టీ సిద్ధాంతం కోసం అబివృద్ధి కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేయాలన్నారు. నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ని, అమరగాని ప్రదీప్, గుజ్జ శ్రీనివాస్‌రెడ్డిలను పార్టీ కార్యకర్తలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దుర్శేట్టి సంపత్, కోమటి రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిది పొన్నం శ్రీనివాస్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు తవ్వారు.. మరమ్మతు మరిచారు


అన్నారంలో రోడ్డు ప్రక్కన త్రవ్వి వదిలేసిన దృశ్యం

మానకొండూర్, మే 19: ఇంటింటికీ తాగు నీరందించాలనే ఉద్దేశ్యంతో చేపట్టిన మిషన్ భగీరథ పథకంలో భాగంగా పైప్‌లైన్ నిర్మాణం కోసం సీసీ రోడ్డును తవ్విన కాంట్రాక్టర్ మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం మండలంలోని అన్నారం గ్రామంలో బస్టాండ్ నుంచి నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకు వరకు సీసీ రోడ్డును పగులకొట్టి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. అంతేకాకుండా ఇదే గ్రామంలోని ఎస్సీ కాలనీలో సైతం సీసీరోడ్డును పగుల కొట్టి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ మరమ్మతు పనులు ఇప్పటి వరకు చేపట్టలేదు. సీసీ రోడ్డును పగులకొట్టిన కాలనీలో నడవాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు అంటున్నారు. అంతేకాకుండా బస్టాండ్ నుంచి వాటర్ ట్యాంకు సీసీరోడ్డును పగులకొట్టి ఏండ్లు గడిచిని మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో మండలంలోని లింగాపూర్, రంగపేట, వెల్ది గ్రామాల ప్రయాణికులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ట్రాక్టర్లు, లారీలు వెళ్లే సమయంలో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అధికారుల ఆలసత్వం ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మత్తు పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నాడు నాటారు.. నేడు నరికివేస్తున్నారు


జమ్మికుంట-కరీంనగర్ రహదారి పక్కన దేవంపల్లి వద్ద నరికివేసిన చెట్లు

మానకొండూర్, మే 19: పచ్చదనం, పరిశుభ్రతే ధ్యేయంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం హరితహారం పథకాన్ని ప్రవేశపెట్టి కోట్లాది మొక్కలను గ్రామాల్లో నాటారు. మండలంలోని ఉపాధిహామీ పథకం, అటవీశాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను ఉపాధి కూలీల ద్వారా సంరక్షించారు. వర్షాకాలంలో ముఖ్యంగా జులై, ఆగస్టు మాసాలలో మొక్కలను రహదారులు, కాల్వల గట్లు, పొలాల గట్లు, పాఠశాలలు, దేవాలయాలు, చెరువుల గట్లపై నాటించారు. ప్రతి ఇంటికి పూలు, పండ్ల మొక్కలను గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో కోట్లాది రూపాయలను వెచ్చించి విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు మొక్కలు నాటారు. కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారి పక్కన మూడు వరుసలు నాటిన మొక్కలు ఏపుగా పెరగడంతో విద్యుత్ లైన్ల కింద ఉండి సరఫరాకు అంతరాయం చేస్తాయని ఇప్పుడు నరికివేస్తున్నారు. రహదారులకు ఇరువైపుల విద్యుత్ స్తంభాలున్న విషయం ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలిసి మొక్కలు నాటాలనే టార్గెట్‌ను పూర్తి చేసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ తతంగం ప్రతి సంవత్సరం జరుగుతున్నా అధికారుల్లో మార్పు రావడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు విద్యుత్‌లైన్ల కింద మొక్కలు నాటకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జమ్మికుంట రూరల్, మే 19: సిరిసిల్లలోని గిరిజన గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో మహిళల ఫైన్ ఆర్ట్స్ అకాడమీ, బీఏ ఆనర్స్ ఫ్యాషన్ డిజైన్, ఫొటోగ్రఫీ-డిజిటల్ ఇమేజింగ్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఆసక్తి కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అంబాల ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న రైతులు

మానకొండూర్, మే 19 : మండలంలోని అన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని జవహర్‌పేట్ కుంటలో అక్రమ మట్టి తవ్వకాలను ఆదివారం రైతులు అడ్డుకున్నారు. జవహర్‌పేట్ కుంటలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని సమాచారం ఇచ్చినా అధికారులు రాకపోవడంతోనే ఎక్స్‌కావేటర్‌ను అడ్డుకున్నామని పరిసర ప్రాంతంలోని రైతులు బండ రాజిరెడ్డి, మోదుంపల్లి చంద్రయ్య, ఎడెల్లి స్వామి, మోదుంపల్లి రవిలు తెలిపారు.